
సాక్షి ఒడిశా

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.2,04,951

వెండి 9 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సాంకేతిక రంగంలో రాష్ట్రం పురోగతి

సాంకేతిక రంగంలో రాష్ట్రం పురోగతి సాధిస్తోం దని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- 8లో



వైభవం.. మహానగర్ ఉత్సవం

బరంపురం కల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానగర్ మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. - 8లో

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లోని మల్టీపర్పస్ గ్రౌండ్స్‌లో మంగళవారం రాత్రి జరిగిన గజజ్యోతి వెట్ ఫెస్టివల్ – 2024 విద్యార్థులను హోరెత్తించింది. వేడుకలను వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు ప్రారంభించగా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం గత మూడు రోజులుగా జరిగిన వివిధ స్పోర్ట్స్ ఈవెంట్స్, డ్రామా, డ్యాన్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రారంభమైన స్టార్ నైట్ సాంస్కృతిక ప్రదర్శనల్లో బాలీవుడ్ పాప్ సింగర్ మధుర్ శర్మ, మరో సింగర్ చందన్ జైశ్వాల్ (ముంబై) పాటలతో అలరించారు. అదేవిధంగా క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు ఆస్వాదించారు. – పర్లాకిమిడి



పాటలు పాడుతున్న పాప్ సింగర్ మధుర్ శర్మ





స్టార్ నైట్‌లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు



విద్యుత్ కాంతుల వెలుగులో వేదిక



పాటలు పాడుతున్న చందన్ జైశ్వాల్



ఫెస్టివల్ తిలకిస్తున్న ఆచార్య డీఎన్‌రావు తదితరులు

న్యూస్‌రీల్

చేప పిల్లలు విడుదల



వంశధారలో చేప పిల్లలు విడిచిపెడుతున్న దృశ్యం

రాయగడ: మత్స్య సంపదను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వంశధార నదిలో మేలిరకం జాతికి చెందిన చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుణుపూర్ ఎమ్మెల్యే మకరంద ముదులి హాజరై గుమడ వద్ద చేప పిల్లలను విడిచిపెట్టారు. మత్స్య సంపదను పెంపొందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏడున్నర లక్షల చేప పిల్లలను నదిలో విడిచిపెట్టేందుకు లక్ష్యం పెట్టుకున్నామని, తొలి విడతగా కొన్ని విడుదల చేశామని జిల్లా మత్స్యశాఖ అధికారి జ్ఞాన రంజన్ శెఠి తెలియజేశారు. కార్యక్రమంలో భామిని సర్పంచ్ వర్షారాణి గొమాంగో, రాష్ట్ర యువజన బీజేడీ కార్యదర్శి పింకు పండ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో

● ముగ్గురు విద్యార్థులకు గాయాలు





ప్రమాదానికి గురైన ఆటో,(ఇన్‌సెట్లో) గాయాలతో విద్యార్థులు

బరంపురం: గంజాం లోని పురుషోత్తపురం, బట్టకుమరడా రహదారిలో ఆదర్శ విద్యాలయానికి వెళ్తున్న స్కూల్ ఆటో విద్యుత్ సంభాన్ని బుధవారం ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్నటువంటి ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శాంతినగర్‌లో అగ్ని ప్రమాదం



ఇంటిపై కుమ్ముకున్న పొగ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీ శాంతినగర్‌లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని నరేందర బాగ్ అనే వ్యక్తి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో దట్టమైన పొగ కమ్ముకోవడంతో కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రాణనష్టం సంభవించకపోయినప్పటికీ, ఇంట్లోని విలువైన వస్తువులు, ధాన్యం బస్తాలు, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

జ్యూట్ బ్యాగులు పంపిణీ



జ్యూట్ బ్యాగులతో లబ్ధిదారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సీంద్రీమాల పంచాయతీలో మన ఒడిశా–నవీన్ ఒడిశా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి అశోక్ కుమార్ మహంతి నేతృత్వంలో రేషన్ కార్డుల లబ్ధిదారులకు జ్యూట్ బ్యాగ్‌లు, రూ.1,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి బీజేడీ కో–ఆర్డినేటర్ జగన్నాథ ఖోర తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర

జయపురం: పట్టణంలో కొరాపుట్ జిల్లా న్యాయ సేవ ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ, మోటార్ వాహనాల చట్టాలపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు సచేతన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవ ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర ప్రారంభించారు. న్యాయసేవ ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన పర్యవేక్షణలో జరిగిన ర్యాలీలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. సీటు బెల్టు ధరించకుండా, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు, న్యాయవాదులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆరేళ్ల బాలికపై అఘాయిత్యం

● పరారీలో యువకుడు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కోట్‌పాడ్‌లో సమాజం తలదించుకోవాల్సిన సంఘటన చోటుచేసుకుంది. ఆరేళ్ల చిన్నారికి ఫోన్‌లో కార్టున్లు చూపిస్తానని చెప్పి ఒక యువకుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మహిళా పోలీసు స్టేషన్‌లో పోస్కో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 26వ తేదీన బాలిక వీధిలో ఆడుకుంటోంది. దీంతో కోట్‌పాడ్ పోలీసుస్టేషన్ ప్రాంతంలో ఒక యువకుడు ఆ బాలికను దగ్గరకు పిలిచాడు. మొబైల్‌లో కార్టూన్లు చూపిస్తానని చెప్పి తీసుకెళ్లాడు. అనంతరం చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఈ విషయాన్ని చిన్నారి ఇంట్లో వారికి చెప్పింది. విషయం తెలిసి బాధితురాలి తండ్రి ఇంటికి వచ్చి కుమార్తెను విచారించగా 15 రోజుల క్రితం కూడా ఆ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు వెల్లడించింది. అప్పుడు బాలిక చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొరిగుమ్మ ఎస్డీపీవో, పోలీసు అధికారులు కోట్‌పాడ్ వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. బాలికకు వైద్య పరీక్షలు జరిపించి తమ రక్షణలో ఉంచారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసు అధికారి అనిత కుజుర వెల్లడించారు.

ఎన్‌ఏసీగా గుర్తించడంపై హర్షాతిరేకాలు



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

రాయగడ: సదరు సమితి పరిధిలోని చందిలి పంచాయతీని ఎన్‌ఏసీగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంపై బీజేడీ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జేకేపూర్‌లో మంగళవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో బీజేడీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలియజేశారు. చందిలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్‌ఏసీగా గుర్తించిందని, ఇకపై ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, పార్టీ సీనియర్ నాయకులు నీలాంబర్ బిడిక, సీతారాం పెద్దింటి, లక్ష్మీ జంబాక, తపస్ కుమార్ పెద్దింటి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నెక్కంటి, పక్కనే మాజీ మంత్రి హిమిరిక

విజేతగా బాలేశ్వర్ జట్టు



ట్రోఫీతో బాలేశ్వర్ టీమ్ సభ్యులు

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో ఆల్ఫా స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 10 రోజులుగా జరుగుతున్న 14వ బిజూ పట్నాయక్ మెమోరియల్ ట్రోఫీ క్రికెట్–2024 కప్పును బాలేశ్వర్ యూ అండ్ మీ జట్టు గెలుచుకుంది. బుధవారం ఫైనల్‌లో ఆల్ఫా స్పోర్టింగ్ క్లబ్, బాలేశ్వర్ జట్ల మధ్య మ్యాచ్ జరగగా, బాలేశ్వర్ చాంపియన్‌గా నిలిచింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, గంజాం బీజేడీ అధ్యక్షుడు డా.రమేష్ చంద్ర చావ్ పట్నాయక్ హాజరై విజేత టీమ్‌కు ట్రోఫీ అందజేశారు.

నల్కో కర్మాగారంలో ప్రమాదం

● ఇద్దరు కార్మికుల దుర్మరణం

జయపురం: కొరాపుట్ జిల్లా దమంజోడిలోని నేషనల్ అల్యూమిని లిమిటెడ్ కంపెనీ కర్మాగారంలో మంగళవారం జరిగిన ఘోర ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు దుర్మరణం చెందారు. ఖనిజ, పరిశోధన ప్రాజెక్టు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికులు శ్యామ రాజ శంసర్ (44), సనత్ కునాయి(34)లు కాగా, మరో కార్మికుడు ఎ.అన్సారి గాయపడ్డాడు. వీరంతా జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవారిగా వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన అన్సారిని కొరాపుట్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ప్లాంట్ విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో దాదాపు 50 క్వింటాళ్ల ఇనుప రాడ్ల బైండింగ్ పనులను ఐదుగురు కార్మికులు చేస్తున్నారు. అయితే బైండింగ్ చేస్తున్న రాడ్లు పక్కకు జరిగి ఆ ప్రాంతంలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులపై జారిపడ్డాయి. దీంతో ఇద్దరు మరణించారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.



కార్మికులపై పడిన ఇనుప రాడ్లు

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గత రెండు రోజులుగా బరంపురం ఎక్సైజ్ విభాగం అధికారులు వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 255 కిలోల గంజాయితో పాటు ఐదుమందిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ సత్తపతి తెలియజేశారు. అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు ముందుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గంగపూర్ పోలీసుస్టేషన్ పరిధి గజపతి జిల్లా మోహన బ్లాక్ గుముసర అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరంలోకి ప్రవేశిస్తున్న కారుపై ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద దాడులు చేపట్టారు. కారులో 4 బస్తాల్లో తరలిస్తున్న 155 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి పశ్చిమ బెంగాల్‌కి చెందిన సంతున్ పరిడాగా గుర్తించారు. అదేవిధంగా దిగపండి పోలీసుస్టేషన్ పరిధి సికిరి జంక్షన్‌లో మరో కారు, స్కూటీపై దాడులు చేసి మరో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 100 కిలోల గంజాయి సీజ్ చేశారు. అరెస్టైనవారిలో ప్రమోద్ దొళాయి, హమాస్ పరిడా, పింటు నాయక్, తపన్ నాయక్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని చలాన్‌గూడ పంచాయతీ రెంగబాండ్ గ్రామ రహదారిలో మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో మంగళవారం రాత్రి తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక వ్యక్తి 3 బస్తాలతో ఉండడం గమనించారు. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని బస్తాలు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో నిందితుడు స్వేతఘెన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయిను తూకం వేయగా 50 కేజీలు ఉంది. దీని విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందని వెల్లడించారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడు

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్


నాగార్జున యాదవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్‌పర్సన్ నాగార్జున యాదవ్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆరోగ్య ప్రదాతగా ఇక్కడ వెలిసిన ఆదిత్యుని దర్శనం సంతృప్తినిచ్చిందని నాగార్జున యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఉచిత శిక్షణ


సుమన్‌రెడ్డిని సత్కరిస్తున్న సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి


ఇచ్ఛాపురం: దేశరక్షణలో విధులు నిర్వహించేందుకు ఉద్దేశించిన అగ్నిపథ్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్ఛాపురంపట్టణంలోని శ్రీ సురంగి రాజా క్రీడామైదానం ఆవరణలో ఉచితంగా శిక్షణ అందిస్తామని మాజీ సైనికోద్యోగి కెప్టెన్ సుమన్‌రెడ్డి అన్నారు. ఇక్కడి మైదానంలో సుమన్‌రెడ్డి రూ.మూడు లక్షలు వెచ్చించి ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బుధవారం సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సుమన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, వైద్యులు గోవింద్, చాట్ల లోహిదాస్‌రెడ్డి, మైదాన అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బత్తుల వెంకటరమణ, అంజి, తిరుపతి, జయకృష్ణ, సోమేష్, నగేష్, క్రీడాకారులు, వాకర్స్ పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టిలోని సాయిమందిరం ఆవరణలో ఉన్న స్థలంలో మినీస్టేడియం ఏర్పాటుకు జాయింట్ కలెక్టర్ నవీన్ బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థల విస్తీర్ణం, స్టేడియానికి అవసరమైన భూమి వివరాలపై ఆరా తీశారు. అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలించారు. ఎత్తుపల్లాలతో ఉన్నప్పటికీ గతంలో మైదానం నిర్మాణానికి ఇదే స్థలం ఎంపిక చేయాలని గ్రామస్తులు వినతిపత్రాలు అందించినట్లు అధికారులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వోలు అన్నాజీరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ సీసీఎస్ మెంబర్‌గా గోవిందరాజులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీస గోవిందరాజులు

గార : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టివ్ కమిటీ స్టేట్ మెంబర్ (జాతీయ స్థాయి) నియమితులైన గార మండలం కొర్ని పంచాయతీ సర్పంచ్ పీస గోవిందరాజులు (గోపి) బుధవారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నియామక వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ మిధునరెడ్డిలకు గోవిందరాజులు ధన్యవాదాలు తెలిపారు.

మెడికల్ షాపులో చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు పట్టుకుని విచారించగా దొంగ అని తేలింది. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు.. ఈ నెల 26న అర్ధరాత్రి దాటాక డేఅండ్ నైట్ కూడలి సమీపంలోని మహలక్ష్మి మెడికల్ షాపులో చోరీ జరిగింది. షాపు వెనుక భాగాన షట్టర్ పగులగొట్టి లోపలికి వెళ్లి రూ.83,900 నగదు దోచుకున్నారు. ఈ విషయమై షాపు యజమాని ముద్దాడ రామకృష్ణ బుధవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు ముందు భాగాన ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా చోరీ చేసింది ఒక్కరే అని గుర్తించారు. బుధవారం సాయంత్రం చోరీ చేసిన వ్యక్తి ఆర్ట్స్ కళాశాలలో అనుమానంగా తిరుగుతున్నాడన్న సమాచారం రావడంతో ఎస్ఐ హరికృష్ణ, మరో నలుగురు కానిస్టేబుళ్లు వెళ్లి మాటువేసి పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడకు చెందిన దేవాన బుజ్జిగా గుర్తించారు. నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించనున్నామని పోలీసులు తెలిపారు.

వైభవం.. మహానగర్ ఉత్సవం

స్థానిక కల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానగర్ మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన వివిధ సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఒడిస్సీ, దనకటియా, బాల భారతం, భారత లీలా, యువత అధునిక నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గోపాల్ పట్నాయక్, సుదీప్ సాహు, నారాయణ మంకుడో తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం


ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర్ సాహు తదితరులు


ఒడిస్సీ నృత్య ప్రదర్శన


భరత లీల నాట్య ప్రదర్శన


ఆకట్టుకుంటున్న చిన్నారుల నృత్యం


కృష్ణలీల నృత్యం


దాండియా నృత్యం


ప్రశంసా పత్రాలతో కళాకారులు

జిల్లాకు చంద్రబాబు చేసిందేమీ లేదు

● మంత్రి ధర్మాన ప్రసాదరావు


ఇప్పిలిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: టీడీపీ హయాంలో ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాలనలో శ్రీకాకుళం జిల్లాకు ఏ ప్రాజెక్టు తీసుకొచ్చావో చెప్పగలవా చంద్రబాబు అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో రూ.62 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ మెడికల్ కాలేజీ, అంబేడ్కర్ యూనివర్సిటీ, వంశధార ప్రాజెక్టు, 35 రహదారి-వంతెనలు, రహదారుల పనులకు నిధుల సేకరణ, రూ.700 కోట్లతో ఉద్దాన ప్రాంతానికి సర్ఫేస్ వాటర్, రూ.4వేల కోట్లతో మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, గ్రామ వార్డు సచివాలయాల ఏర్పాటు.. ఇలా ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో స్వర్ణయుగం తీసుకొచ్చామని వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో ముందుకు వస్తున్నారని, వాటిని నమ్మవద్దని హితవుపలికారు. రాజధాని పేరుచెప్పి వ్యాపారం చేసుకొనే చంద్రబాబుకు ప్రజల స్థితిగతులను, వారి జీవన ప్రమాణాలను మార్చే ఆలోచన లేదన్నారు. మూడు రోజులు క్రితం శ్రీకాకుళంలో రా..కదలిరా పేరిట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మాట్లాడే మాటలు వింటే నవ్వు వస్తోందన్నారు. శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను గత పాలకులు గాలికొదిలేస్తే తామే అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీను, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్లా రవికుమార్, గంగు నరేంద్రకుమార్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం


పతకాలతో క్రీడాకారులు

కాశీబుగ్గ : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టుకు తృతీయ స్థానం లభించింది. సామర్లకోటలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా జట్టు ఆద్యంతం పోరాట పటిమ కనబరిచిందని కోచ్ బొండాడ తిరుమలరావు తెలిపారు. పలాస ప్రభుత్వ మైదానంలో శిక్షణ పొందిన జట్టు ఆడుదాం ఆంధ్రా మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయిలు దాటుకుంటూ రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ సైన్స్ కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు


సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ విభాగం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒడిషాలోని పర్లాకిమిడిలో ఉన్న ప్రతిష్టాత్మక సెంచూరియన్ యూనివర్సిటీ మరో ఘనతను సొంతం చేసుకుంది. కళాశాలలో ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సు (ప్రోగ్రాం)కు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) గుర్తింపుతోపాటు అనుమతి లభించింది. ఫిషరీస్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆక్వా కల్చర్‌పై విద్యార్థులు పరిశీలనతో పాటు ప్రాక్టికల్స్‌గా నేర్పించేందుకు తాజా గుర్తింపు దోహదపడుతుందని భావిస్తున్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సులో ఆక్వా కల్చర్, ఫిషరీస్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రోసెసింగ్ టెక్నాలజీ, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ఇంజనీరింగ్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ తదితర సబ్జెక్టులు ఈ డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా ఉంటాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు లభించడం పట్ల ప్రొఫెసర్ డి.ఎస్.రావు సంతోషం వ్యక్తంచేశారు.

డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సంక్షేమ సంఘం డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌ను నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు బుధవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం బాధ్యతను మరింత పెంచిందన్నారు.

సమాజ సేవకు సైన్స్ ఉపయోగపడాలి


విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు, ఆదిత్య కళాశాల యాజమాన్యం

టెక్కలి : సామాజిక సేవకు మాత్రమే సైన్స్‌ను ఉపయోగించాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని 23 పాఠశాలలకు చెందిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థుల సైన్సు ప్రదర్శన నిర్వహించారు. సమగ్రశిక్ష, పాఠశాల విద్య, ఎస్‌సీఈఆర్‌టీ, యూనిసెఫ్, విజ్ఞాన్ ఆశ్రమ్ సారథ్యంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సహకారంతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో 23 పాఠశాలల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ. 5000, 4000, 3000 చొప్పున ఆదిత్య కళాశాల యాజమాన్యం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌కు ఆదిత్య కళాశాల సహకారం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్, డి.శ్రీరాములు, డి.రఘువీర్, పి.సుమన్, డి.భానుచంద్ర, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి మూడు ప్రాజెక్టులు..

అటల్ ఇన్నోవేషన్ ప్రదర్శనలో భాగంగా మూడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సైన్స్ అధికారి కుమారస్వామి వెల్లడించారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.గాయత్రి, జస్వంత్‌పాత్రో, డిల్లేశ్వర్రావు రూపకల్పన చేసిన విమెన్ సేఫ్టీ స్మార్ట్ పవర్ స్టిక్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రోహిత్ శ్రీసాయి, ప్రీతమ్, నితీష్ రూపకల్పన చేసిన మల్టీ ఫంక్షనల్ అగ్రికల్చరల్ రోబోట్ ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు డి.నవీన్ కుమార్, డి.దివాకర్, పి.వికాస్‌కుమార్ రూపొందించిన సన్ ట్రాకింగ్ సోలార్ సిస్టం తృతీయ స్థానం లభించింది.

సాంకేతిక రంగంలో రాష్ట్రం పురోగతి


ప్లానిటోరియం ప్రారంభోత్సవంలో మంత్రి సరక తదితరులు


ప్లానిటోరియం


ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న కలాం విగ్రహం


వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

● సీఎం నవీన్ పట్నాయక్

రాయగడ: సాంకేతిక రంగంలో రాష్ట్రం పురోగతి సాధిస్తోందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సదరు సమితి బాకురుగుడలో సుమారు రూ.14 కోట్లతో నిర్మించిన ప్లానిటోరియాన్ని వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధునిక, సాంకేతిక విద్యను అందించేందుకు 5టీ పథకం ద్వారా పాఠశాలలు, కళాశాలలను ఆధునీకరించామని వెల్లడించారు. ఉన్నత చదువులు అభ్యసించే విధంగా సైన్స్ ల్యాబ్‌లు, డిజిటల్ విద్యాబోధన వంటి మెరుగైన సౌకర్యాలను కల్పించామని తెలియజేశారు. అంకితభావం, శ్రద్ధతో విద్యార్థులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఖగోళ శాస్త్రంపై అవగాహన

ఖగోళ శాస్త్రంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్లానిటోరియాలను ఏర్పాటు చేశామన్నారు. కొరాపుట్, రాయగడ వంటి ప్రాంతాల్లో ప్లానిటోరియాలు అందుబాటులో లేకపోవడంతో ఇదివరకు వీటిని వీక్షించేందుకు రాజధానికి వచ్చేవారన్నారు. ఇక అటువంటి సమస్యలు లేకుండా ప్రతీ జిల్లాలో ప్లానిటోరియాలు ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో కలహండి, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్, బౌధ్, పూరీ, నయాగఢ్ జిల్లాల్లో అత్యాధునిక సౌకర్యాతో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. త్వరలో ఆయా జిల్లాల్లో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ చైర్మన్ సరస్వతి మాఝి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, బిజూ స్వాస్థ్య కల్యాణ సమితి రాష్ట్ర శాఖ ముఖ్యసలహాదారుడు సుధీర్ దాస్, అమో ఒడిశా-నవీన్ ఒడిశా జిల్లా సమన్వయకర్త పట్నాన గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకుడు


ప్రశంసా పత్రాలతో రక్తదాతలు

జయపురం: బొరిగుమ్మ సమితి సెమలగుడ పంచాయతీ నకులగుడ గ్రామంలో బిద్యాధర పూజారి తన తండ్రి దీనబందు జ్ఞాపకార్థం గ్రామంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. అమో ఒడిశా, సంబాద్‌ల సహకారంతో నిర్వహించిన శిబిరంలో పరిసర గ్రామాలకు చెందిన యువత రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 23 యూనిట్ల రక్తం సేకరించారు. బీజేడీ జిల్లా సాధారణ కార్యదర్శి సురేంద్ర త్రిపాఠీ మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రఫుల్ల అమనాత్య, జయపాత్ర, భువన పూజారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాలు

● సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి
● అధికారులతో సమీక్షలో శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య


స్వామివారిని దర్శించుకుంటున్న ఆర్డీఓ రంగయ్య

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మార్చి 8 నుంచి 11 వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య అన్నారు. బుధవారం శ్రీముఖలింగంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన పలు శాఖల అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, పాలక మండలిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ నెల 29న స్వామివారి ఉత్సవ పనులకు పందిరిరాట వేసి అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. ఉచిత ప్రసాదాలు, తాగునీరు, క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. 108, 104 అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

చక్రతీర్థ స్నానాలపై ప్రత్యేక శ్రద్ధం..

శివరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు మార్చి 11న పక్షి తీర్థం(వంశధార నదిలో) మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థ స్నానాలు(త్రిశూల్) జరగనున్నాయని, లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు అదనంగా నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటూ వైద్య శిబిరాలు ఉండాలన్నారు. ఉత్సవాల సమయంలో శ్రీముఖలింగం, పరిసర గ్రామాలలో మద్యం అమ్మకాలు నిరోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, సీఐ బూర ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పాలక మండలి చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, ఈఓ ప్రభాకరరావు, ఎంపీడీఓ దామోదరరావు, వైద్యాధికారులు శ్రీకాంత్, ప్రసాద్, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు అవసరం


ల్యాబ్‌లో పరికరాలు పరిశీలిస్తున్న ఆర్‌జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్ : సాంకేతిక విద్యలో విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యమివ్వాలని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక కేంద్రం రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్‌ను బుధవారం సందర్శించారు. జాతీయ సైన్స్ డే వేడుకలు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం క్యాంపస్‌లో నిర్వహించిన ది ఇంటర్‌సెక్షన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎండ్ ది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అన్న అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక అంశాల్లో పట్టు సాధించాలని, ప్రస్తుతం వస్తున్న పారిశ్రామిక మార్పులు గమనించాలని సూచించారు. అనంతరం క్యాంపస్‌లో నిర్మిస్తున్న భవనాలు, ల్యాబ్ పనులు, మెస్ నిర్వహణ పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలమాంబ జాతర ఆదాయం లెక్కింపు


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఆదాయాన్ని ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. ఐదు,ఆరవ జాతరలో ప్రత్యేక, శీఘ్ర దర్శనం, కేశఖండన, లడ్డూ, పులిహోర ప్రసాదం, అన్నదాన విరాళం ద్వారా రూ. 12,47,073ల ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలి పారు. హుండీలలో భక్తులు సమర్పించుకున్న కానుకలను వచ్చేవారం లెక్కిస్తామని ఈఓ సూర్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి ఎంఎస్ఎంఈ సంస్థల సర్వే

పార్వతీపురం: మధ్య తరహా, చిన్న, సూక్ష్మ పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వేను మార్చి 1 నుంచి నిర్వహిస్తామని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగుపరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ (ఆర్ఏఎంపీ) పథకం కింద సర్వే జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈల సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని సంస్థలను డిజిటల్ ప్లాట్ ఫామ్‌లోకి తీసుకొచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టర్‌కు అనుసంధానిస్తున్నట్టు వెల్లడించారు. సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అమెనిటీ సెక్రటరీలు మార్చి1 నుంచి 20వ తేదీ వరకు సర్వే చేపడతారన్నారు. సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం పర్యవేక్షిస్తుందన్నారు.

3 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్


సంకిలి కర్మాగారానికి తరలిస్తున్న చెరకు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 3 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి వెల్లడించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులు సాగుచేసిన చెరకును నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలు తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ప్రస్తుతం రైతులు కటింగ్ ఆర్డర్లు తీసుకుని, చెరకును కోసిన వెంటనే ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని తెలిపారు.

ఘనసర చేరిన ఏనుగుల గుంపు


ఘనసర సమీపంలోకి చేరిన ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని ఘనసర గ్రామ సమీపానికి బుధవారం నాలుగు ఏనుగుల గుంపు చేరింది. తివ్వాకొండ పరిసరాల్లో ఇటీవల వరకు సంచరించిన ఏనుగులు తిరిగి ఘనసరకు చేరుకోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

వీడీవీకే పరిశీలన

పార్వతీపురంటౌన్: మండలంలోని డోకిశిల పంచాయతీ డెప్పివలస గాంధీజీ వన్‌ధన్‌వికాస్ కేంద్రంలోని కొండ చీపుళ్ల తయారీ కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు బుధవారం సందర్శించారు. మహిళలతో మాట్లాడారు. మంచి వ్యాపార వేత్తలుగా తయారు కావాలని సూచించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీపీఎం పి.ప్రవీణ్, ఏపీఎం పి.సురేష్, చేయూత ఏపీఎం సతీష్, మండల సమాఖ్య అధ్యక్షుడు వై.జగదీశ్వరి, ఎఫ్‌పీఓ సీసీ అప్పలనాయుడు, వీఓఏలు హాజరయ్యారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు

విజయనగరం క్రైమ్: మోటారు సైకిళ్ల చోరీలు, దొంగతనాల కేసుల ఛేదనలోనూ.. అక్రమ మద్యం, గంజాయి, నాన్ బెయిల్‌బుల్ వారంట్ల ఎగ్జిక్యూషన్.. ట్రాఫిక్ రెగ్యులేషన్, డ్రంకన్ డ్రైవ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక బుధవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రశంసాపత్రాలు పొందిన వారిలో విజయనగరం టూటౌన్ సీఐ కేకే రామారావు, ఎస్సైలు ఐ.దుర్గాప్రసాద్, జి.రాజేష్, ఎస్.హరిబాబునాయుడు, జె.తారకేశ్వరరావు, ఏఎస్సై సీహెచ్. ఆరి, హెచ్‌సీ ఎస్.హరికృష్ణ, కానిస్టేబుళ్లు ఎం.వాసు, కేవీ గణేష్, కె.సత్యం, వి.రఘు, టి.సతీష్, డి.దేముడు, జి.రమేష్, సీహెచ్. అప్పలనాయుడు, ఎం.మహేశ్వరరావు, కె.చిరంజీవి, మహిళా కానిస్టేబుళ్లు జి.గౌరమ్మ, మహిళా హోంగార్డు ఎస్. ఇందుమతి ఉన్నారు.

అభివృద్ధి వెం'బడి'

- డిజిటల్ విద్యలో ముందంజలో విజయనగరం విద్యార్థులు
- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్


నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్


మౌలిక సదుపాయాలపై విద్యార్థులతో ముచ్చటిస్తున్న నాగార్జున యాదవ్

విజయనగరం అర్బన్/నెల్లిమర్ల: పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, అధునాతన బోధన విధానాలను విద్యార్థులకు కల్పించాలనే ఆలోచన దేశంలోనే ప్రప్రథమంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) యనమల నాగార్జున యాదవ్ తెలియజేశారు. ఈ మేరకు విజయనగరం జిల్లాలో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఉన్నతమైన మార్పులను, అదనంగా నిర్మించిన తరగతి గదులను, నిర్వహిస్తున్న డిజిటల్ క్లాస్‌రూమ్స్‌ను పరిశీలించేందుకు విజయనగరం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జిల్లాలోని పలు పాఠశాలల్లో నాడు-నేడు పనులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై వాకబు చేశారు. 10 రకాలైన మౌలిక వసతులు తప్పకుండా ప్రతి ప్రభుత్వ బడిలోను విధిగా ఉండాలనే ఉన్నత ఆశయంతో విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో 1579 పాఠశాలల్లో రూ.431 కోట్లు ఖర్చు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. జిల్లాలోని మెట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెల్లిమర్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుడతనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను నాగార్జున యాదవ్‌తో పాటు ఏపీఈడబ్ల్యూఐడీసీ బృందం సందర్శించింది. రాష్ట్రంలో రూ.17 వేల కోట్లకు పైగా వెచ్చించి ప్రభుత్వ బడులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించారని, ఈ అవకాశాన్ని విద్యారులంతా తప్పక ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు

గతంలో పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక చాల ఇబ్బందులు పడేవారం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మా బడి ముఖచిత్రమే మారిపోయింది. మరుగుదొడ్ల నుంచి ఐఎఫ్‌పీ ప్యానెల్స్ దాకా ఈ ప్రభుత్వం ఎంతగానో తమను ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని విద్యార్థులు తెలియజేశారు. ఈ పర్యటనలో ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ బమ్మిడి లక్ష్మి, ఈఈ డీవీఎస్ మూర్తి, డీఈ వేణుగోపాల్, ఏఈ జాన్సన్, ఎంఈఓలు యుఎస్ఎన్ మూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల మార్చి 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూ గురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ ఫోన్ 6303508032, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ 9490971090 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో ఖాళీలు ఇలా ఉన్నాయి

- ఏకలవ్య కురుపాంలో 6వ తరగతిలో 30 (బాలురు),30 బాలికలతోపాటు 7వ తరగతిలో ఒకటి బాలికలు, 9వ తరగతిలో 8 (బాలురు),3 (బాలికలు)కు సీట్లు ఖాళీగా ఉన్నాయి.
- ఏకలవ్య అనసభద్ర పాఠశాలలో 6వ తరగతిలో 30(బాలురు), 30 (బాలికలు)తోపాటు 7వ తరగతిలో 3 (బాలురు),4 (బాలికలు), 8వ తరగతిలో 2 (బాలురు), 1(బాలికలు),9వ తరగతిలో 1(బాలురు)
- ఏకలవ్య కొటికపెంట పాఠశాలలో 6వ తరగతిలో 30(బాలురు),30(బాలికలు), 7వ తరగతిలో 1(బాలురు), 1(బాలికలు), 8వ తరగతిలో7(బాలురు), 9వ తరగతిలో 5(బాలురు)
- ఏకలవ్య గుమ్మలక్ష్మీపురంలో 6వ తరగతి 30(బాలురు), 30(బాలికలు),7వ తరగతిలో 3(బాలురు) సీట్లు ఖాళీగా ఉన్నాయి.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్ పంపిణీ


వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ నిధులతో కొనుగోలు చేసిన బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు దివ్యాంగులకు బుధవారం అందజేశారు. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన కొరికానా శ్రుతి, కొటారిపురం గ్రామానికి చెందిన భట్న భవాని, గుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన పట్నాన సన్యాశినాయుడులకు జెడ్పీ చైర్మన్ బ్యాటరీ ట్రైసైకిల్స్‌ను అందజేశారు.

రూ.50 వేల చెక్కు అందవేత

రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన బండి పార్వతి ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించడంతో ఆమె భర్త బండి భాస్కరరావుకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 వేల చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గుర్ల ఎంపీపీ పొట్నూరు సన్యాసినాయుడు, రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షినిమోహన్, బొద్దాం సర్పంచ్ నక్క శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికత పెంపొందించుకోవాలి

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య



సత్కారం పొందుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఉన్నతమైన ఉద్యోగం, మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఇంజినీరింగ్ విద్యతో పాటు ఆధునిక సాంకేతికత పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి సాంకేతిక సింపోజియాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో దేశాభివృద్ధికి కీలకంగా నిలుస్తారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాంఖ్యా టెక్నాలజీస్ సీఈఓ, ప్రధాన సాంకేతిక నిపుణుడు గోపికుమార్ బులుసు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు పెద్ద సంఖ్యల్లో రోజువారీ సమస్యలను పరిష్కరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా సాంఖ్యా టెక్నాలజీస్ రూపొందించిన డిజిటల్ బ్యాగ్‌పై విద్యార్థులకు వివరించారు. అనంతరం యూనివర్సిటీ వీసీని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి బి.నళిని, డైరెక్టర్లు డాక్టర్ కె.బాబులు, కేసీబీరావు, టీఎస్ఎన్‌మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌గురునాథ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ డాక్టర్ జి.అప్పలనాయుడు, డాక్టర్ ఎం.హేమ, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎస్‌కేమోహిద్దీన్ బాబా, ఆర్ లిపిక చౌదరి, సీహెచ్ కాశీవిశ్వనాథన్, పూడి లిఖితశ్రీ, వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు చీటింగ్ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: ఓఎల్ఎక్స్‌లో బైకులు అమ్ముతామని మోసగించి, కొనుగోలు దారుల నుంచి డబ్బులు తీసుకుని, మోసగించినట్లు రుజువైన మూడు కేసుల్లో ముద్దాయి కర్రి శివరామకృష్ణకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి బి.రమ్య బుధవారం తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ముద్దాయి జరిమానా చెల్లించని పక్షంలో ఒక్కో కేసులో మరో నెల చొప్పున జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు సీఐ చెప్పారు. వెల్లడించారు. కేసుల్లో దర్యాప్తు అధికారిగా అప్పటి వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్ వ్యవహరించగా, సీనియర్ ఏపీపీ రాజరాజేశ్వరి పోలీసుల తరఫున వాదనలు వినిపించారని సీఐ వివరించారు.

భార్యను వేధిస్తున్న భర్తకు ఏడాది జైలు

బొబ్బిలి: కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తకు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా కోర్టు విధించినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని యాతవీధికి చెందిన లెంక గోవిందమ్మను తూర్పుగోదావరి జిల్లా సైదులుపేటకు చెందిన భర్త లెంక రామునాయుడు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని డిసెంబర్ 20, 2014లో ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై నాయుడు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. దీనిపై పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్ దామోదరరావు ముద్దాయికి సంవత్సరం జైలు శిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరావు వాదించారు.

శాంతియుత ఎన్నికలకు ప్రణాళిక అవసరం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్


పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. ఈ మేరకు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జనవరి నెలకు సంబంధించి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను జిల్లాలో శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుండే సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్ల ప్రకారం విభజించి ప్రత్యేక అధికారులను నియమించి, అక్కడ అనుసరించవలసిన కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, 174 సీఆర్‌పీఎస్ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులను ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదనలో, పరిష్కారానికి, నేర నియంత్రణ దోహదం చేసే పలు సూచనలు, మెలకువలపై దిశానిర్దేశం చేశారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలను అందజేశారు. బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో తప్పిపోయిన మహిళలను వెతికి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచినందుకు కె.కాంతారావు, డబ్ల్యూహెచ్‌సీ జి.సరోజిని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల్లో ప్రతిభ కనబర్చినందుకు పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పీసీ జి.శివప్రసాద్, శంబర జాతరలో చక్కగా విధులు నిర్వహించందుకు మక్కువ పోలీస్‌స్టేషన్ పీసీ వి.జగదీశ్వరరావుకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ ఉనీల్ షరోన్, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ జి.మురళీధర్, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, ఎస్పీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ వాసునాయుడు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, జిల్లా సీఐలు, ఎస్సైలు, ఎ.సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, పి.సూపరింటెండెంట్ సూర్యకుమారి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి: డొంకినవలస-బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జ్ ఎస్.కృష్ణారావు విలేకరులకు తెలిపారు. కాషాయ రంగు నలుపు పువ్వుల లుంగీ, తెలుపు, బూడిదరంగు కలిగిన షర్టు వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తు పడితే ఎస్సై రవివర్మ ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

30 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండల కేంద్రం దత్తిరాజేరు కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష బుధవారం తెలిపారు. స్థానికులు అందజేసిన సమాచారం మేరకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వంగరలో మరో 30

వంగర: మండల పరిధి శ్రీహరిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై వైవీ జనార్దన్ బుధవారం తెలిపారు. మద్దువలస వద్ద పట్టుబడిన ఆ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

రూ. 70 లక్షలతో సీతంపేటకు బీటీ రోడ్డు


సీతంపేట రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండలంలోని కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.70 లక్షలతో కిలోమీటరు మేర బీటీ రోడ్డును నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు పనులు సాగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామి యాజులు, గౌడు సంతోషిరాణి, పార్టీ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, కొత్తకోట వెంకట సురేష్‌కుమార్, గవర విజయ్‌చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ ప్రభుత్వం

- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమకు అండగా నిలుస్తున్నారంటున్న అన్నదాతలు
- రూ.29.32 కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ
- సున్నా వడ్డీ కింద 27,905 మందికి రూ.5.23 కోట్లు
- లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేసిన కలెక్టర్ నిశాంత్‌కుమార్


లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సాక్షి, పార్వతీపురం మన్యం: తన నమ్మకం.. ధైర్యం రైతన్నలే అని తరచూ చెప్పే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి.. రైతు సోదరులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. పెట్టుబడి సాయంగా ఐదో ఏడాదిలో మూడో విడత రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం కింద నిధులను బుధవారం విడుదల చేశారు. 2023-24 సంవత్సరానికి జిల్లాలో 1,46,016 మంది రైతుల ఖాతాలకు రూ.29.32 కోట్లను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి జమచేశారు. సున్నా వడ్డీ కింద 27,905 మంది రైతులకు 2021-22 రబీ సీజన్, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.5.23 కోట్లను విడుదల చేశారు. కార్యక్రమాన్ని పార్వతీపురం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, లబ్ధిదారులు తిలకించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్ జిల్లాస్థాయి రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం నిధుల మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కావలసిన అన్ని సేవలనూ రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తోందని చెప్పారు. అందరూ కచ్చితంగా ఈ-పంటలో తమ వివరాలను నమోదు చేసుకుంటేనే పథకాల లబ్ధి, సేవలు పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

ఇచ్చిన మాట ప్రకారం వరుసగా ఐదో ఏడాది కూడా పెట్టుబడి సాయంతోపాటు, సున్నావడ్డీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏటా ఇచ్చిన హామీ ప్రకారం నగదు జమ చేసి ఆదుకుంటున్నారని తెలిపారు.

ప్రభుత్వం ఆదుకుంటోంది..



వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ నిధులతో పాటు, సున్నా వడ్డీ రుణాలను ప్రభుత్వం సక్రమంగా అందిస్తోంది. పంట కొనుగోలు సమయంలోనూ దళారుల బెడద లేకుండా రైతుకు అండగా నిలుస్తోంది. దీనివల్ల రైతులకు చాలా వరకూ సమస్యలు తగ్గిపోయాయి. మాలాంటి నిరుపేద రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం చల్లగా ఉండాలి.

– గాదాపు మాధవరావు, అడ్డాపుశీల, పార్వతీపురం

సాయమందుతోంది..



పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ మొత్తం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. గతంలో అధిక వడ్డీకి రుణాలు తెచ్చుకునేవారం. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది. ప్రభుత్వం మాలో ధైర్యాన్ని కలిగించింది. స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పిస్తోంది.

– రెడ్డి దివ్యవాణి, ఎం.ఆర్.నగరం, పార్వతీపురం

అన్ని సేవలూ రైతు చెంతకే..



విత్తనాలు, ఎరువుల దగ్గర నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలూ ఆర్బీకేల్లోనే జరుగుతున్నాయి. దీనివల్ల రైతుకు గతం మాదిరి శ్రమ తప్పింది. నేడు పండిన పంటకు మద్దతు ధర పొందగలుగుతున్నామంటే అది ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్లే.

– వంగల శ్రీరాములునాయుడు, కందివలస, కొమరాడ మండలం

రుణపడి ఉంటాం..



గతంలో వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉండేది. పెట్టుబడి కోసం నానాప్రయాసలు పడేవారం. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టేవారం. పంట చేతికొచ్చి మంచి ధర వస్తే ఫర్వాలేదు. లేదంటే పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేది కాదు. ఈ ప్రభుత్వం ఏటా మూడు విడతలుగా మాకు నగదు సాయం చేసి ఆదుకుంటోంది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

– గాదాపు సింహాచలం, అడ్డాపుశీల, పార్వతీపురం